# చవట చదువులు

ఈ పదేండ్లలో కొంత ప్రపంచజ్ఞానం సంపాదించినా అసలు మా ఆవిడ ప్యాసు అయింది మూడోక్లాసే! కాని ఆ మూడో క్లాసు ఇప్పటి మూడోక్లాసా! ఆవిడ చెపితే వినాలె ఆ సంగతి. ఆ క్లాసే వేరు, ఆ చదువులే వేరు. ఆ పంతుళ్ళే వేరు. అదొక స్వర్ణయుగం క్రింద మారుచేసి కబుర్లు చెపుతుంది. ఇప్పటి చదువులన్నీ చవట చదువులట! ఆవిడ అంటుంది వినండి ఆవిడ మాటలు.

మా కాలంలో పంతులమ్మను జూస్తే హడిలిపోయే వాళ్ళం! చెప్పిందంటే ఇప్పటికాలపు చవట లెక్కలా? అప్పుడు మేము మూడోక్లాసులో చేసిన లెక్కలు ఇప్పుడు బి.ఏ. ఎల్.టీలు కూడా చెయ్యలేరు. ఒక్కొక్క రూపాయల అణాల కూడిక చెయ్యటానికి మూడురోజులు పట్టేది! ఇప్పుడేం లెక్కలు, వెధవ లెక్కలు, పిల్లలు రెండుపద్దులు కూడా కూడలేరు.

"ఏ, ఒక పనిని, పది రోజులలో చేస్తాడటా; ఆ పనినే, బి, పదిహేను రోజులలో చేస్తాడటా, ఏ.బిలు కలసి ఆ పనిని ఎన్ని రోజులలో చేస్తారు అని లెఖ్ఖ ఒకటి ఇచ్చారు అమ్మాయికి! అదొచ్చి నన్ను అడిగింది. ఎట్లాగే అమ్మా యీ లెక్క చేయటమూ? అని,

చెప్పావా?

చెప్పాలిసిందే సిగ్గులేక! నాలుగు చీవాట్లూ వేసి పంపాను దాన్నీ, అటువంటి తెలివితక్కువ లెక్క ఇచ్చిన పంతులమ్మను కూడా!

ఏం, ఆ లెక్కలో తెలివితక్కువతనం ఏముంది?

ఏముందా, ఏ ఒక పనిని చేస్తుంటే, బి ఆ పనినే ఏడ్వకపోతే ఇంకో పనికి పోరాదూ? అది... అట్లా ఉంచండి...

పది రోజులలో చేసేవాడొకడుండంగా, పదిహేను రోజులదాకా దేకే తెలివితక్కువ వెధవనుకూడా పెట్టుకోవడం శుద్ధ వెర్రితనము.

మూడో విషయం.

ఆ ఇద్దరినీ పనిలో పెడితే, అది ఎన్నిరోజులలో పూర్తి అవుతుంది అని కాదూ ప్రశ్న? అంతకంటె వెర్రిప్రశ్న ఇంకొకటి లేదు. ఎంచేతనంటారా ఆ వెధవలు ఇద్దరూ కలిస్తే ఆ పని చస్తే పూర్తి గాదు. బి మెల్లగా చేసేవాడుగద! ఏ వాడ్ని చూచి

నేమటుకు ఆయాసపడి ఎందుకు నరాలుతెంచుకోవాలె అని. మెల్లగా చేయటం సాగిల్లేడు. వాడే అట్లా ఏడుస్తుంటే నాకేం అని బి మరీ నీలుగుతాడు. ఇట్లా వంతులు పడతై అనుకోండి. ఇక ఆ పని తగలడ్డదన్నమాటేనా? అదీ నేను చెప్పేది.

"మేము చదువుకునే రోజులలో బజారుబిల్లుల లెక్కలు చేసేవాళ్ళం. కాని అవి శుభ్రమైనటువంటివి, ఇప్పటికాలపు పాపిష్ఠి బజారు బిల్లులు కావు.

లెక్కల్లో శుభ్రమైనవేమిటి? పాపిష్ఠి వేమిటి? చూడండి చెపుతాను; ఒకడు బజారుకు వెళ్ళి నెయ్యి నాలుగు వీసెలు, కందిపప్పు పదిశేర్లు పెసలు, మినుములు, ఇవన్నీ ఇన్ని ఇన్ని శేర్లు కొన్నాడంటే అందులో తప్పేమీ లేదు. అటువంటివి చెపుతున్నారండీ ఇప్పుడు? అమ్మాయి చేసే లెక్కలు చూస్తున్నాను. ఇవ్వేమిటండీ దరిద్రపు లెక్కలు! ఒక వర్తకుడటా. మణుగు పదిహేను రూపాయల చొప్పున రెండు మణుగుల నెయ్యి కొని అందులో నాలుగు వీసెల దుంప నెయ్యి కలిపాడట? ఛాఛా! ఆ నెయ్యి ఎవరైనా కొంటారా? ఆ వెధవ ఎవరో, ఆ నేతినంతా, తలమాసిన వాళ్ళకు అంటగట్టి లాభం తీశాడుట!! మనకెందుకా దరిద్రపు గోల? ఎవడెట్లా ఏడిస్తే మనకేం: ఇటువంటి అవకతవక పనుల సంగతికాక, సజావైన సంగతులేచెప్పరాదా? అదీ నేననటం?

ఆర్యులు ఎటువంటివాళ్ళో చెప్పండి?

ఆర్యులు ఆజానుబాహులు. శ్వేతవర్ణం కలవారు చక్కనివారు.

అవునామరి, ద్రావిడులో?

ద్రావిడులు అనాగరికులు. నల్లనివారు. పొట్టివారు. ఉంగరాలు చుట్టుకొని పోయి గొట్టెబొచ్చులాంటి జుట్టు కలిగి ఉండేవారు. వారివి చప్పిడి ముక్కులు - వారి పెదవులు లావుగా నుండేవి. ద్రావిడులు అందవికారులు.

అవునా మరి, ఆ మేష్టరు మనం ద్రావిడులమని చెప్పాడట అమ్మా ఆ క్లాసులో! అదొచ్చి నాతో చెప్పింది. నాకు ఒళ్ళు మండిపోయింది చెప్పొద్దూ - ఈ వెధవ చదువులను జూస్తే.

ఏం జేస్తాంమరి?

ఆ మాష్టరును చెవులు సాగదీయాల ఇటువంటి దొంగమాటలు చెప్పినందుకు.

అట్లా అని కబురు పంపనా ఆయనకు?

ఆ, అంత పని అయినట్లే లెండి, ఈ తభా అట్లా చెపితే, మీరు ద్రావిడులైతే

కావచ్చు. మేము మటుకు కాము. మాది ఋషి సాంప్రదాయము. మేము ఆర్యులము అని మాస్టరుతో చెప్పమని అమ్మాయితో చెప్పాను.

అమ్మాయి భూగోళశాస్త్రం చదువుతుంది. దానికి ఎంతవరకు తెలుసోనని రెండుమూడు ప్రశ్నలు వేసి చూచాను. అమెరికా ఎట్లా ఉంటుందీ అని అడిగితే మేకతలకాయలాగ ఉంది అన్నది. అమెరికావాళ్ళు మెచ్చుకోతగిన పనులు ఏమి చేశారూ అంటే ఆకాశాన్ని అంటే మేడలు కట్టారు. మంచి మంచి సినిమా ఫిలిములు తయారుచేశారూ అంటుంది. ఈ దేశాన్ని కొలంబస్ అనే ఆయన స్థాపించాడట. ఆయన స్థాపించటం ఏమిటండీ నాకు తెలియక అడుగుతాను? ఈ మధ్య అమెరికా కొంతకాలం ఎండిపోయి (America has gone dry) మళ్ళీ ఇప్పుడు చెమ్మగిల్లింది – ఏమిటి ఈ మాటల కర్థం? అంటే, ఒకటిలే! ఇంగ్లీషులో ఉన్న వాక్యాలకు తెలుగు జేయటంలో వచ్చిన అవస్థ అదీ. ఇంగ్లీషులో అమెరికా ఎండిపోయిందంటే తాగుడు మానారన్నమాట –

అట్లా చెప్పరాదూ. ఈ భాష ఏమిటి? ఇట్లాగే ఉన్నయి ఈ కాలపు చదువులన్నీ! జపాను వాళ్ళకు కళ్ళు వంకరనీ, నీగ్రోలకు ముక్కు వంకరనీ మూతి వంకరనీ, జూలియస్ సీజరు తలకాయ తాటికాయంత ఉండేదనీ, ఇవీ అది నేర్చుకొనే విషయాలు! ఎందుకన్నా పనికొచ్చే విషయాలేనా ఇవి? ఎవరి తలకాయ ఎంత ఏడిస్తే ఎవరికి కావాలె? ఏరాజు ఎంతమంది భార్యలను చేసుకొంటేనేమి? వాడెవరో ఒక ఇంగ్లండు రాజు ఆరుగురు భార్యలను చేసుకొన్నాట్ట ఒకదాని తరువాత ఒకరిని! మహా గొప్పా ఏమిటి? మనరాజులు, ఎంత తక్కువవాడైనా ఎనిమిది మందికి తక్కువ చేసుకోడు గదా!

చిన్నక్లాసుల్లో చదువు చూద్దామన్నా అదీ అధ్వాన్నం చతుర్మమధ్యంగా ఉంది. ఆ చిన్న వెధవ చదువు చదువుతున్నాడు వినండి. "అదిగో, ఆవు. ఆవుకు ఎన్ని కాళ్ళు? నాలుగు. దానికి కొమ్ములుండును. అది కొమ్ములతో పొడుచును. చూశారా ఆ వరస. ఆవుకు నాలుగు కాళ్ళని వీరు చెప్పకపోతే ఇక తెలియదా? చిన్నతనములో ఏ రుక్మిణీ కల్యాణంలో నుంచో నాలుగు పద్యాలు వల్లన వేయిస్తే ఆజన్మాంతం జ్ఞాపకం ఉంటవే! ఏమిటీ వెధవ వాక్యాలు! వెధవ చదువులూను!

*(బాలసరస్వతి, ఏప్రిల్ 1937)*